క్లుప్తంగా

అవినీతి అధికారిని సస్పెండ్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేపాక లింగయ్య

సూర్యాపేటటౌన్ : జిల్లా కోశాధికారి కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న నిమ్మల వెంకన్నను సస్పెండ్ చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేపాక లింగయ్య డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని డీటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త ఉపాధ్యాయుల జీతాలు మంజూరు చేసేందుకు ఏకంగా డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శినే లంచం డిమాండ్ చేశారని ఆరోపించారు. లంచం ఇవ్వక పోవడంతో బిల్లులు పాస్ చేయకుండా తిరిగి పంపిస్తున్నాడన్నారు. సదరు అధికారిపై సమగ్ర విచారణ జరిపి విధుల నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీరావు, వెంకటేశ్వర్లు, ఎం. దశరథ రామారావు, పి.వెంకటేశ్వర్లు, కె.యోగానంద్ వేణు,రమణ, జిల్లా కార్యదర్శులు సిద్దిక్ పాషా, వెంకటేశ్వర్లు, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు మృతి



రాజమ్మ(ఫైల్)

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు దివంగత కొమ్ము గోపాల్ సతీమణి, తెలంగాణ సాయుధపోరాట యోధురాలు కొమ్ము రాజమ్మ మంగళవారం మృతి చెందారు. ఆ పార్టీ నాయకులు ఆమె మృతదేహం వద్ద నివాళులర్పించారు. వారిలో సీపీఎం మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్, చెన్నబోయిన వీరయ్య, శిగ వెంకన్న ,రాములు, రవికుమార్, రవి, వినయ్, శ్రీనివాస్, శ్రీకాంత్, యాదగిరి, రాములు, సౌందర్య, లలిత, రింగు శ్రీరాములు, శిగ శ్రీరాములు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



చిన్నారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

అర్వపల్లి: మండల పరిధిలోని వేల్పుచర్ల గ్రామ అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో సరుకుల స్టాకును, రిజిస్టర్లను పరిశీలించారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందిస్తుండటం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, అంగన్‌వాడీ టీచర్ ఖమ్మంపాటి ధనలక్ష్మి పాల్గొన్నారు.


పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీఓ

అర్వపల్లి: గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మండల పరిధిలోని కొమ్మాల, కోడూరు గ్రామాల్లో మంగళవారం పోలింగ్ కేంద్రాలను మండల పంచాయతీ అధికారి టి.గోపి పరిశీలించారు. ఎన్నికల సందర్భంగా ఓటర్లకు ఏలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అన్ని వసతులు కల్పించాలని కోరారు. నీళ్ల, విద్యుత్ ఇతర వసతులు ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నవీన్‌రెడ్డి, నారాయణమూర్తి, ఫర్హాన, రాజశేఖర్‌రెడ్డి, స్రవంతి, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బాల మల్లేష్‌కు ఘన నివాళి



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట) : ఇటీవల హఠాన్మరణం చెందిన సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాల మల్లేష్‌కు సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నివాళులు అర్పించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో బాల మల్లేష్ చిత్రపటానికి పూలమాల వేసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే వామపక్ష రాజకీయాల్లో పాల్గొంటూ ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ వ్యవసాయ కార్మిక సంఘం, బీసీ హక్కుల సాధన సమితిలో రాష్ట్రస్థాయి బాధ్యతలు నిర్వహించారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బెజవాడ వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, ధూళిపాళ ధనుంజయ నాయుడు, ఉప్పలయ్య, గుండు వెంకటేశ్వర్లు, బూర వెంకటేశ్వర్లు, నంద్యాల రామిరెడ్డి, జంపాల మల్లయ్య, దొంతగాని సత్యనారాయణ, ఎడెల్లి శ్రీకాంత్, వెంకటేశ్వర్లు, గోవిందు, అరుణ రవి చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

‘న్యాస్’కు రెడీ

- నేడు 3,6,9 తరగతుల విద్యార్థులకు నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే
- 2,067 మంది విద్యార్థులకు పరీక్ష
- ఇప్పటికే మోడల్ టెస్టులు నిర్వహించిన ఎస్‌సీఈఆర్‌టీ



న్యాస్‌కు ఎంపిక చేసిన పాఠశాలలు, విద్యార్థులు

తరగతి	పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య
3వ	36	980
6వ	30	870
9వ	35	1000

సూర్యాపేటటౌన్ : విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను అంచనా వేసేందుకు కేంద్ర మానవవనరుల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించే నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(న్యాస్)కు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. 2024–25 విద్యా సంవత్సరానికి గాను ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న 3, 6, 9 తరగతులకు చెందిన ఎంపిక చేసిన విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించనున్నారు. ఇప్పటికే మోడల్ టెస్టులు నిర్వహించి విద్యార్థులను పరీక్షకు సిద్ధం చేశారు.

2,067 మంది విద్యార్థులకు..

న్యాస్ కోసం జిల్లాలో 101 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల నుంచి మొత్తం 2,067 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. పరీక్ష నిర్వహించే మూడు తరగతులకు పేపర్లు వేరువేరుగా ఉంటాయి. పరీక్ష పేపర్ కూడా వివిధ కోడింగ్‌లలో ఏ, బీ, సీ, డీలుగా విభజించి ఉంటుంది.

ఇప్పటికే ఉపాధ్యాయులకు శిక్షణ

జిల్లాలో 3, 6, 9 తరగతుల విద్యార్థులకు తెలుగు, ఆంగ్లం, సైన్స్, సాంఘిక శాస్త్రం, గణితం సబ్జెక్టుల్లో బుధవారం పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్ష మల్టిపుల్ చాయిస్ విధానంలో ఉంటుంది. విద్యార్థులను పరీక్షకు ఎలా తయారు చేయాలో సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. ఇందుకోసం జిల్లా విద్యాధికారి, జిల్లా స్థాయి అధికారులు, అకడమిక్ అధికారులు న్యాస్‌పై రోజువారీగా పాఠశాలలను సందర్శించి విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు.

వందశాతం హాజరు కావాలి

ఎంపిక చేసిన విద్యార్థులకు ఉదయం 10.30గంటలకు సర్వే నిర్వహించాలి. శాంపిల్ పాఠశాలల హెచ్ఎంలు 3, 6, 9 తరగతుల విద్యార్థుల పేరు, వయసు, ఎత్తు ఫీట్లలో, బరువు, సామాజిక వర్గం, ప్రత్యేక అవసరాలు గల పిల్లల వివరాలను ముందుగానే సిద్ధం చేసుకొని ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్‌కు సమర్పించాలి. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు 100 శాతం ఉండాలి. 4వ తేదీన శాంపిల్ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు ఏ రకమైన సెలవు కూడా మంజూరు చేయకూడదు. ఎస్‌సీఈఆర్‌టీ పంపించిన జాబితాలో ఉన్న మీడియం ప్రకారమే ప్రశ్నాపత్రాల సరఫరా ఉంటుంది. బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్నుతో ఓఎంఆర్ షీట్‌లో బబ్లింగ్ చేయాల్సి ఉంటుంది. ఈ విషయాలు ఉపాధ్యాయులు, విద్యార్థులు గుర్తించుకోవాలి.

– అశోక్, డీఈఓ

ప్రగతిని తెలియజేయడానికే ఉత్సవాలు

- 2కే రన్‌ను ప్రారంభించిన అదనపు కలెక్టర్ రాంబాబు



2కే రన్‌ను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్

సూర్యాపేట : రాష్ట్ర ప్రభుత్వం ఏడాది కాలంలో సాధించిన ప్రగతిని ప్రజలకు తెలియజేయడానికే జిల్లా వ్యాప్తంగా విజయోత్సవాలు నిర్వహిస్తున్నామని అదనపు కలెక్టర్ రాంబాబు పేర్కొన్నారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం సూర్యాపేట మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించిన 2కే రన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అర్బన్ డే సందర్భంగా సూర్యాపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికుల కోసం హెల్త్ క్యాంప్ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ మాట్లాడుతూ సూర్యాపేట పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి పారిశుద్ధ్య కార్మికులు నిరంతరం కష్టపడి పనిచేస్తున్నారన్నారు. కార్మికుల సేవల ద్వారానే సూర్యాపేట మున్సిపాలిటీకి జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులు లభించాయన్నారు. అత్యుత్తమ సేవలందించిన కార్మికులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, ఈఈ కిరణ్, డీఈ సత్యారావు, ఎస్ఐలు శ్రీనివాస్, సతీష్, జూనియర్ అసిస్టెంట్లు గౌసుద్దీన్, ఎస్ఎస్ఆర్ ప్రసాద్, యాదగిరి, మనోజ్, మెప్మా ఇన్‌చార్జ్ శ్వేత పాల్గొన్నారు.

ఏం సాధించారని ఉత్సవాలు ?

తుంగతుర్తి: కాంగ్రెస్ ఏడాది పాలనలో ఏం సాధించిందని రైతులు ఉత్సవాలు నిర్వహిస్తుందని సీపీయూఎస్ఐ జిల్లా కార్యదర్శి మట్టపల్లి లింగయ్య ప్రశ్నించారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పూర్తిగా విఫలమైందన్నారు. ఏ ఒక్క హామీని అమలు చేయకుండా ఏడాది కాలం గడిపిందన్నారు. పింఛన్లు పెంచలేదని, మహిళలకు రూ.2500 ఇవ్వలేదన్నారు. ఆయనతో పాటు వెంకట్రాములు, దశరథ, వెంకన్న తదితరుల ఉన్నారు.

నీటి విడుదల షెడ్యూల్ ప్రకటించాలని వినతి



నీళ్లు నిలిచిపోయిన 71 డీబీఎం కాలువ

అర్వపల్లి: యాసంగి సీజన్‌కు సంబంధించి గోదావరి జలాల విడుదలపై షెడ్యూల్‌ను ప్రకటించాలని రైతులు కోరుతున్నారు. డిసెంబర్ నెల ప్రారంభమైనా ఇంతవరకు షెడ్యూల్ రాకపోవడంతో అన్నదాతలు పంటల సాగుపై ముందుకు సాగలేక పోతున్నారు. షెడ్యూల్ వస్తేనే దాని ప్రకారం నార్లు పోసుకునే అవకాశం ఉందని చెబుతున్నారు. గత నెల 15 నుంచి యాసంగి సీజన్ మొదలైంది. నీటి వసతి అంతంత మాత్రంగా ఉన్న రైతులు పొలాలు దున్ని సిద్ధం చేసుకున్నారు. గత సీజన్‌లో డిసెంబర్ నెలలోనే నీటిని విడుదల చేశారు. ఈసారి ఇంతవరకు షెడ్యూల్ విడుదల చేయకపోవడంతో అయోమయంలో పడ్డారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీటితో నిండుకుండలా ఉన్నా రెండోదశకు నీటి విడుదలపై ఎలాంటి ప్రకటన చేయడంలేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. జాజిరెడ్డిగూడెం మండలంలో ఈ సీజన్ నందు సుమారు 20 వేల ఎకరాలకు పైగానే పంటలు సాగయ్యే అవకాశం ఉంది. ఇందులో 80 శాతం సాగు గోదావరి జలాలపైనే ఆధారపడి ఉన్నందున అధికారులు షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మత్తు పదార్థాలు మానవ మనుగడకు ప్రమాదకరం



మాట్లాడుతున్న ఎస్ఐ మహేంద్రనాథ్

నూతనకల్ : మత్తు పదార్థాలు మానవ మనుగడకు ప్రమాదకరమని ఎస్ఐ మహేంద్రనాథ్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలీసు కళాజాతా ఆధ్వర్యంలో మంగళవారం సైబర్ నేరాలు, గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలు, రోడ్డు ప్రమాదాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసినట్లయితే బ్యాంకు ఖాతా, ఏటీఎం, ఓటీపీ వివరాలను తెలుపరాదని సూచించారు. సైబర్ మోసాలపై 1930టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్, గంజాయి, మత్తుమందులపై కలిగే నష్టాలను కళాజాతా బృందం సభ్యులు ఆటాపాటల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో రాములు నాయక్, హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, కళాబృందం ఇంచార్జి ఎల్లయ్య, గోపయ్య, గురులింగం, కృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తున్న మోదీ ప్రభుత్వం



మాట్లాడుతున్న నెమ్మాది వెంకటేశ్వర్లు

నాగారం : కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక చట్టాలను కఠినతరం చేస్తూ పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తుందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు విమర్శించారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన నాగారం, తిరుమలగిరి, అర్వపల్లి మండలాల సీఐటీయూ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మోదీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టి కార్పొరేట్ కంపెనీల లాభాల కోసం పని చేస్తుందన్నారు. బీజేపీ ప్రభుత్వంలో ప్రభుత్వ సెక్టార్‌లో పని చేసే ఉద్యోగ, కార్మికులకు ఇవ్వాల్సిన పీఎఫ్ నిధులను పక్కదారి పట్టించి రిటైర్మెంట్ తర్వాత కనీసం బతకటానికి కావాల్సిన పింఛన్ కూడా లేకుండా చేస్తున్నాందన్నారు. సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అనంతు మల్లయ్య, సీఐటీయూ జిల్లా కమిటి సభ్యులు వజ్జె సైదయ్య, సోమన్న, మంగయ్య, మహేష్, హమాలీ సంఘం నాయకులు లింగయ్య పాల్గొన్నారు.

శ్రీకాంతాచారికి ఘన నివాళి



శ్రీకాంతాచారి చిత్రపటానికి కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

సూర్యాపేటటౌన్: మలిదశ తెలంగాణ విద్యార్థి ఉద్యమ తొలి అమరుడు శ్రీకాంత్ చారి ఆశాలను సాధించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ లింగయ్య యాదవ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో శ్రీకాంతాచారి చిత్రపటానికి కొవ్వొత్తులతో ప్రదర్శన చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఏదో ఒక జిల్లాకి శ్రీకాంత్ చారి పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారినా, పాలకులు మారిన శ్రీకాంతాచారి కుటుంబాన్ని ఆదుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో శ్రీకాంతాచారి విగ్రహాన్ని పెట్టాలని కోరారు. కార్యక్రమంలో పోలోజు మహేశ్‌చారి, విద్యార్థులు స్వాతి, అనూష, రేణుక, ప్రియాంక, శిరీష, చందన, నందిని, శైలజ, కావ్య తదితర పాల్గొన్నారు

మద్దిరాల : మలిదశ తెలంగాణ ఉద్యమ అమరుడు శ్రీకాంతాచారి వర్ధంతిని మండల పరిధిలోని గోరెంట్ల గ్రామంలోని విశ్వబ్రహ్మణులు మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీకాంతా చారి మృతితోనే ప్రత్యేక రాష్ట్ర కల సాకారమైందని అన్నారు. ప్రతి ఒక్కరు ఆయన ఆశయాలను సాధించాలని అన్నారు. కార్యక్రమంలో విశ్వబ్రహ్మణులు తాడోజు వెంకటచారి, పోలోజు సైదులు, తాడోజు విక్రమచారి, తాడోజు భీష్మాచారి, పోతుగంటి వెంకటచారి, రామ్‌చరణ్, విశ్వనాథచారి,పోలోజు విక్రమచారి పాల్గొన్నారు.

తుంగతుర్తి: తెలంగాణ రాష్ట్ర సాధనకు ప్రాణత్యాగం చేసిన అమరుడు శ్రీకాంతాచారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య కోరారు. మంగళవారం మండల కేంద్రంలో శ్రీకాంతాచారి వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గుండగాని రాములు, గోపగాని శ్రీనివాస్, చింతకుంట్ల మనోజ్, ఉప్పుల నాగమల్లు, వెంకటేష్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శన

మద్దిరాల : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని తహసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు.వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున్న కాంటాలు అయిన ధాన్యాన్ని వెంటనే లోడు వేయాలని సూచించారు.

విద్యార్థులకు పెన్నులు పంపిణీ

చివ్వెంల: మండల పరిధిలోని తిమ్మాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007–08సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు మంగళవారం పాఠశాల విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు, నోట్‌బుక్స్‌పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రేణుక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని ఆందోళన

తుంగతుర్తి: రావులపల్లి గ్రామం నుంచి తుంగతుర్తికి ఉదయం పాఠశాల, కళాశాల సమయాల్లో బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ మంగళవారం విద్యార్థులు రావులపల్లి ఎక్స్‌రోడ్డులో బస్సు ఎదుట ఆందోళన చేపట్టారు. రావులపల్లి గ్రామం నుంచి రావులపల్లి ఎక్స్‌రోడ్డు తండాకు బస్సు లేక ఉదయం, సాయంత్రం వేళల్లో 3కిలో మీటర్ల నడుచుకుంటూ వస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

టైలర్ కుమారులకు ప్రభుత్వ కొలువులు

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రానికి చెందిన కట్టోజు సత్యనారాయణ – భాగ్యలక్ష్మిలది నిరుపేద కుటుంబం. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు కట్టోజు సాయికుమార్, చిన్న కుమారుడు శివకుమార్. టైలరింగ్ పని చేస్తూ ఇద్దరిని ఉన్నత చదువులు చదివించాడు. పెద్ద కుమారుడు కట్టోజు సాయికుమార్ ఎస్‌బీఐ బ్యాంక్‌లో కస్టోడియన్ ఆఫీసర్‌గా ఎంపిక కాగా చిన్న కుమారుడు కట్టోజు శివకుమార్ సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. ఇద్దరు కుమారులకు ఉద్యోగాలు రావడంతో తండ్రి కట్టోజు సత్యనారాయణ దంపతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం



అర్వపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



తిరుమలగిరి : ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



నాగారంలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ

నాగారం : సమాజంలోని ప్రతి ఒక్కరూ దివ్యాంగులను సమదృష్టితో చూడాలని స్థానిక ఎంపీడీఓ మారయ్య, ఎంఈఓ వాసం ప్రభాకర్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సమగ్ర శిక్షాభియాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ జ్ఞానేశ్వరచారి, హెచ్ఎంలు రాందాస్‌నాయక్, ఉమమహేశ్వరీ, సీడబ్ల్యూఎస్ఎన్ స్పెషల్ టీచర్ మీనా, మండల ఇంక్యూజివ్ ఎడ్యూకేషన్ రిసోర్స్ పర్సన్ ఎస్‌కె.బాషా, కార్యదర్శి చంద్రశేఖర్, పాధ్యాయులు వీరేష్, భాస్కర్ పాల్గొన్నారు.

దివ్యాంగులను ఆదరించాలి

పెన్‌పహాడ్: సమాజంలో ప్రతి ఒక్కరూ దివ్యాంగులను ఆదరించాలని మండల విద్యాధికారి నకిరేకంటి రవి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా దివ్యాంగులకు పోటీలు నిర్వహించారు. అదే విధంగా మండల పరిధిలోని అనాజీపురం ఆదర్శ పాఠశాలలో అంతర్జాతీయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కోడి లింగయ్య గ్రామంలోని దివ్యాంగులకు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వనజ, ఉపాధ్యాయులు రాంబాబు, ఆనంద్‌భాస్కర్, పావని, పాల్గొన్నారు.

తిరుమలగిరి (తుంగతుర్తి) : తిరుమలగిరి మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి ఐ.శాంతయ్య మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు దామర శ్రీనివాసులు, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ ఎ.పూర్ణచందర్, ఐఆర్‌సి పి.వాణి, భిక్షపతి, రవీందర్, నరేష్, సత్యనారాయణ, సోమేష్, శ్యామ్ పాల్గొన్నారు.

అర్వపల్లి: అర్వపల్లిలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అలాగే ఎమ్మార్సీ భవనంలో దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలునాయక్, స్థానిక జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం విజయలక్ష్మి, ఐఈఆర్పీ మురళీధర్‌రావు, స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయుడు బి.రమేష్, దివ్యాంగులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దివ్యాంగులపై వివక్ష తగదు

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : సమాజంలో దివ్యాంగుపై వివక్ష తగదని ఎంఈఓ ధారసింగ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన దివ్యాంగుల దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం దివ్యాంగ విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుమార్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఊర్మిళ, ఐఆర్పీ చారి, ఉపాధ్యాయులు వనజ పాల్గొన్నారు.

వికలాంగులను ఆదరించాలి

నూతనకల్: వికలాంగులను ప్రతి ఒక్కరూ ఆదరించాలని ఎంఈవో రాములునాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లోని పాఠశాలల్లో వికలాంగుల దినోత్సవం పురస్కరించుకొని వికలాంగులకు నిర్వహించిన ఆటల పోటీల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఐఆర్పీ అప్పారావు, విద్యాసాగర్ రావు తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి

తుంగతుర్తి: దివ్యాంగులు అన్నిరంగాల్లో రాణించాలని స్థానిక ఎంఈఓ బోయిని లింగయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి మాట్లాడారు. సమాజంలో ప్రతి ఒక్కరు దివ్యాంగులను వివక్షతతో చూడొద్దన్నారు. దఅనంతరం దివ్యాంగ విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్పీ ఉపేందర్, సీఆర్పీ మల్లయ్య పాల్గొన్నారు.

మద్దిరాల : మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయురాలు బి.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో దివ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ కె.స్వరూప,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శకుంతల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి

- మండల ప్రత్యేకాధికారి జగదీశ్వర్ రెడ్డి



రికార్డులు తనిఖీ చేస్తున్న ప్రత్యేకాధికారి

చివ్వెంల(సూర్యాపేట) : విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి భావిపౌరులుగా ఎదగాలని మండల ప్రత్యేకాధికారి జగదీశ్వర్ రెడ్డి ఆకాంక్షించారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తురిబా గాంధీ బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని స్పెషల్ ఆఫీసర్‌ను ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రత్యేకాధికారి దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను వారం రోజుల్లో పరిష్కరించాలని ఎస్ఓను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సీహెచ్. సంతోష్ కుమార్, పంచాయతీకార్యదర్శి విక్రమ్, ఎస్ఓ నాగలక్ష్మి పాల్గొన్నారు.

కానిస్టేబుళ్లు క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి



నాగారం : కానిస్టేబుళ్లకు సూచనలు ఇస్తున్న సీఐ రఘువీర్‌రెడ్డి

నాగారం : విధి నిర్వహణలో పోలీసులు క్రమశిక్షణ ,బాధ్యతతో విధులు నిర్వహించాలని నాగారం సర్కిల్ సీఐ రఘువీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని నాగారం పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఇటీవల శిక్షణ పూర్తి చేసుకుని విధుల్లోకి చేరిన నూతన కానిస్టేబుల్‌లకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడానికి పోలీస్ ఉద్యోగం మంచి అవకాశమన్నారు. సమాజంలో పోలీసు విధులు అనేవి చాలా ప్రత్యేకమైనవని, ఇతర శాఖలతో పోలిస్తే పోలీసు డ్యూటీ క్లిష్టమైనది, సవాళ్లు, లక్ష్యాలతో కూడిందని పేర్కొన్నారు. పోలీసులు ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. ప్రజలలో పోలీసులపై నమ్మకాన్ని కల్పించాలని అన్నారు. అనంతరం నాగారం సర్కిల్ పరిధిలో విధుల్లో చేరిన 20 మంది నూతన కానిస్టేబుళ్లను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎం.ఐలయ్య, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ వృత్తి బాధ్యతాయుతమైంది

అర్వపల్లి: పోలీస్ వృత్తి బాధ్యతాయుతమైనదని అర్వపల్లి ఎస్ఐ సీహెచ్.బాలకృష్ణ చెప్పారు. అర్వపల్లి స్టేషన్‌కు నూతనంగా నియమితులైన కానిస్టేబుళ్ల పి.సతీష్, జి రేణుక, జె.త్రివేణి, టి.మహేష్, కె.మణికుమార్, ఎ.సతీష్, డి.సాయికుమార్‌లు మంగళవారం స్థానిక స్టేషన్‌లో విధుల్లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎస్ఐ పరేడ్ నిర్వహించారు. ప్రజలకు సేవచేయడంలో పోలీసు ఉద్యోగం మంచి మార్గమని అన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు రామకోటి, రాములు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వహించొద్దు

నూతనకల్ : కానిస్టేబుళ్లు విధి నిర్వహణలో అలసత్వం వహించొద్దని ఎస్ఐ మహేంద్రనాథ్ అన్నారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో నూతనంగా 8మంది కానిస్టేబుళ్లు విధుల్లో చేరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు శాంతిభద్రతల పర్యవేక్షణలో విధులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వర్తించి పోలీసు శాఖకు పేరు ప్రతిష్టలు తేవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేశ్వర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీసు ఉద్యోగం ఉత్తమమైంది

తుంగతుర్తి: ప్రజలకు సేవ చేయడానికి పోలీసు ఉద్యోగం ఉత్తమ మార్గమని తుంగతుర్తి సీఐ శ్రీనునాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సర్కిల్ కార్యాలయంలో నూతనంగా ఉద్యోగంలో చేరుతున్న కానిస్టేబుల్స్‌కు పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు ఉద్యోగంలో లక్ష్యంతో పనిచేసి సమాజంలో గుర్తింపు తెచ్చుకోవాలని, క్రిమినల్స్ పట్ల కఠినంగా ఉండాలన్నారు. క్రమశిక్షణ లేకుండా ప్రజలను ఇబ్బందులు పెడితే శాఖాపరమైన చర్యలు ఉంటాయి అని హెచ్చరించారు. అనంతరం సర్కిల్ పరిధిలోని విధుల్లో చేరిన 22 మందిని అభినందించారు. కార్యక్రమంలో తుంగతుర్తి ఎస్ఐ క్రాంతి కుమార్, నూతనకల్ ఎస్ఐ మహేంద్రనాథ్, మద్దిరాల ఎస్ఐ వీరయ్య, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా కమిటీ సభ్యుల ఎన్నిక

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని నాగులపాటి అన్నారం గ్రామానికి చెందిన ధనియాకుల శ్రీకాంత్ వర్మ, వీరబోయిన రవిలను సీపీఎం జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. మూడు రోజుల నుంచి సూర్యాపేటలో నిర్వహించిన సీపీఎం జిల్లా 3వ మహాసభల్లో వీరిని జిల్లా కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల పక్షాన నిరంతరం ఉద్యమాలు నిర్వహించడంతో పాటు పార్టీ అభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు.

మార్కెట్ యార్డులో సీసీ కెమెరాలు పెట్టాలని ధర్నా

భానుపురి (సూర్యాపేట) : వ్యవసాయ మార్కెట్‌లోని ప్రతి షెడ్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది కటేశ్వర్లు వ్యవసాయ మార్కెట్ సెక్రటరీని కోరారు. మంగళవారం మార్కెట్ స్వీపర్లతో కలసి మార్కెట్ కార్యాలయ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ లో రైతుల దగ్గర కొని కాంట వేసి బస్తాలు కుట్టి షెడ్‌లో పెట్టిన 39 ధాన్యం బస్తాలు దొంగతనానికి గురయ్యాయని చెప్పి స్వీపర్ల కూలి ఇవ్వకపోవడం ఎంతవరకు సమంజసం అన్నారు. షెడ్ కింద ఉండే ఇద్దరు మహిళా స్వీపర్లు 39బస్తాలు దొంగతనం చేసే అవకాశం ఉంటుందా అని ప్రశ్నించారు. ధాన్యం బస్తాలు మాయం కావటంపై విచారణ చేసి దోషులని శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపేందర్, జ్యోతి, గురవయ్య, సుశీలమ్మ, పద్మ,తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

నాగారం : అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల బుచ్చిబాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏడాది పూర్తయిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్‌పార్టీకే దక్కిందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య, పసుపులేటి వెంకట్‌రెడ్డి, పాశం యాదవరెడ్డి, నాతి వీరమల్లు, కడారి సోమయ్య, కన్నెబోయిన అంజయ్య, పాదిల నరేష్, మల్లేపాక యాకన్న తదితరులు పాల్గొన్నారు.